క్లుప్తంగా

లబ్ధిదారునికి పింఛను పంపిణీ

పూతలపట్టు: మండలంలోని అయ్యప్పగారిపల్లికి చెందిన సుబ్రమణ్యం తిరుపతిలో రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ బి.దీప ఆస్పత్రికి వెళ్లి ఆయనకు రూ.3000 వేలు పింఛన్ అందజేశారు. తిరుపతి వచ్చి పింఛను మొత్తం అందజేసినందుకు సుబ్రమణ్యం ఆనందం వ్యక్తం చేశాడు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

పూతలపట్టు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డులో పేర్ల మార్పు, భూ సమస్యలు తదితర రెవెన్యూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

గుడిపాల: సార్వత్రిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎస్ఐ శ్రీనివాసరావు ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

గుండెపోటుతో హెల్త్ అసిస్టెంట్ మృతి


సుబ్రమణ్యం (ఫైల్)

పూతలపట్టు: స్థానిక పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సుబ్రమణ్యం శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కాంట్రాక్ట్ పద్ధతిలో హెల్త్ అసిస్టెంట్‌గా 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు పలువురు సంతాపం తెలిపారు.

ఎన్నికల్లో గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు


కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్ఐ సుధాకర్ రెడ్డి

తవణంపల్లె: రానున్న ఎన్నికల్లో గొడవలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. ఆయన ఆదివారం గతంలో గొడవలకు పాల్పడిన, అనుమానితులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు. పోలీసుల ఆదేశాలను ధిక్కరిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అనంతరం మత్యం క్రాస్‌లో వాహనాలను తనిఖీ చేశారు.

రూ.22 లక్షలతో డార్మెటరీ మరమ్మతులు


డార్మెటరీ గదులను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ రిజీష్

బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లె గురుకుల పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం జోయాలూకాస్ ఫౌండేషన్ సహకారంతో రూ.22 లక్షలతో డార్మెటరీ గదులకు మరమ్మతులు చేశారు. గదులు లీకేజీ కాకుండా పనులు చేయడంతోపాటు టైల్స్ వేశారు. మరికొన్ని పనులు చేసి గదులకు కొత్తదనం తీసుకువచ్చారు. ఆదివారం వీటిని ఫౌండేషన్ రీజినల్ మేనేజర్ రిజీష్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించిందని కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 22వ తేదీ నుంచి రెండు రోజులపాటు జాతీయ అంచనా, అక్రిడేషన్ సిబ్బంది కళాశాలను పరిశీలించారని తెలిపారు. ప్రధానంగా కళాశాలలో పరిశోధన కేంద్రాలను, తరగతి గదులు, మౌలిక వసతులను నిశితంగా పరిశీలించారని తెలియజేశారు. ప్రిన్సిపల్, బోధన బోధనేతర సిబ్బంది కృషి ఫలితంగా ఈ విషయం సాధించామని డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

కామధేనువుపై గరళ కంఠుడి చిద్విలాసం

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి సర్వ మంగళ సమేత పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం గరళ కంఠుడు కామధేను వాహనంపై ఊరేగారు. ఉదయం పరివార దేవతలకు అభిషేకాలు చేశారు. సాయంత్రం వాల్మీకేశ్వర స్వా మి, మరగదాంబిక అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు.

ఎందరు కలిసినా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోతాయి


జ్యోతిరెడ్డినగర్‌లో పర్యటిస్తున్న విజయానందరెడ్డి


మాట్లాడుతున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోతాయని వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సాంబయ్యకండ్రిగలో ఇంటింటా ప్రచారం చేశారు. అయనకు స్థానికులు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. పలు సంవత్సరాలుగా రోడ్డు సమస్యతో బాధ పడుతున్నామని తెలిపారు. సొంత నిధులతో సాంబయ్యకండ్రిగ వరకు రోడ్డు మరమ్మతు పనులు చేపట్టడంపై విజయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ అమలుకానీ హామీలు ఇవ్వడం తమ నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాదన్నారు. ఇచ్చిన హామీలను తీర్చడం, ఇవ్వనవి కూడా చెయ్యడం మాత్రమే ఆయనకు తెలుసన్నారు. డివిజన్ వాసులు చూపుతున్న ఆప్యాయతను మరవలేమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హరిణిరెడ్డి, నాయకులు మురళీరెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు కార్పొరేషన్: నియోజకవర్గంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయ జేఏసీ నాయకులు


విజయానందరెడ్డిని కలిసిన గాయత్రీదేవి

ఆదివారం చిత్తూరులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయ జేఏసీ నాయకులు మాట్లాడుతూ జిల్లాల విభజన తర్వాత చిత్తూరు పలు రంగాల్లో వెనుకబడిందన్నారు. ఇక్కడ యూనివర్సిటీ, రింగ్ రోడ్డు, అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అదే విధంగా నగరంలో ఉపాధ్యాయ భవన్ నిర్మిస్తే సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా ఉంటుందన్నారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను జగనన్న ఆశీస్సులతో పరిష్కరించుకుందామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలోనూ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారు చెప్పిన విద్యాబుద్ధులు కడవరకు గుర్తుంటుందన్నారు. ఈ ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎం అయ్యాక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళతానని వివరించారు.

మహిళా పక్షపాతి జగనన్న

చిత్తూరు కార్పొరేషన్: ఆడుపడుచుల సంక్షేమం కోసం కృషి చేసే గొప్ప మనిషి జగనన్న అని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు గాయత్రీదేవి తెలిపారు. ఆమె ఆదివారం తన నివాసం నుంచి ర్యాలీగా వచ్చి ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్న సైనికురాలిగా పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్తగా విజయానందరెడ్డి ఉండడం ఆనందకరమన్నారు. చిత్తూరు అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్‌సీపీ మళ్లీ గెలవాలన్నారు. గత పాలనలో చిత్తూరులో అభివృద్ధి ఏమి జరిగిందో చెప్పాలని నిలదీశారు. జిల్లా కేంద్రంలో అభివృద్ధి జరగాలంటే ఫ్యాన్‌ను మళ్లీ గెలిపించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌బాబు, కార్తీ, ప్రసాద్, విక్కీ, తేజ, బాలాజీ, ప్రభు, షంసు, రూపేష్, శరణ్య, కౌసల్య, లావణ్య, ఈశ్వరి, భారతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకే బలిజల మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

- చంద్రబాబు కాపులను కరివేపాకులా వాడుకుంటున్నారు
- గంగినేని పార్కులో బలిజ సంఘం నాయకుల సమావేశం

చిత్తూరు రూరల్: చంద్రబాబు కాపులను కరివేపాకులా వాడుకుంటున్నారని బలిజ సంఘం నాయకులు మధురాయల్, నందగోపాల్ దుయ్యబట్టారు. చిత్తూరు నగరంలోని గంగినేని పార్కులో ఆదివారం బలిజ సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. కాపులకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు, పార్టీలకు అతీతంగా కల్పిస్తున్న పదవులను గుర్తించారు. ఆ తర్వాత అందరి అభిప్రాయం మేరకు వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు బలిజ కులస్తులు అధిక సంఖ్యలో మద్దతు పలికారు. వారు మాట్లాడుతూ కాపులను ముఖ్యమంత్రి చేస్తానని చంద్రబాబు ఆశచూపి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడు చంద్రబాబు పవన్ కల్యాణ్‌కు కల్లబొల్లి మాటలు చెప్పి ఇదిగో వంద సీట్లు..అదిగో 50 సీట్లు..అని చివరికి 24 సీట్లు ఇచ్చాడన్నారు. అవి కూడా ఓడిపోయే స్థానాలని ఆందోళన వ్యక్తం చేశారు. అయినా 24 సీట్లతో ఈరాష్ట్రాన్ని కాపులు ఎలా శాసిస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు తన స్వభావాన్ని మరోమారు బయటపెట్టి కాపులను కరివేపాకులా వాడుకుంటున్నారని ఆరోపించారు. మోసం చేయడం టీడీపీ అధినేతకు కొత్తేమీ కాదని, వెన్నెతో పెట్టిన విద్యనన్నారు. కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కాపునేస్తం పేరుతో 45 ఏళ్లపైబడి 60 ఏళ్ల లోపు ఉన్న మహిళలకు ఆర్థికసాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. బలిజ వర్గం వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి ఆరణి శ్రీనివాసులును 40 వేల ఓట్ల మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిపించింది వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. ఆరిపోయిన శ్రీనివాసులుకు త్వరలో చిత్తూరు ప్రజలు, బలిజ కులస్తులు రాజకీయ ఘోరీ కడతారని తెలిపారు. శ్రీనివాసులు బలిజలకు చేసిన ద్రోహాన్ని ఎప్పటికి మర్చిపోమన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డికి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. తర్వాత శ్రీకృష్ణదేవరాయుల విగ్రహ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో నందగోపాల్, మధురాయల్, వివేకనందరవి, అప్పుజీ, శివకుమార్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలతో ప్రమాదాలకు చెక్


బంగారుపాళెం: ద్విచక్రవాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ నాగరాజరావు


బంగారుపాళెం: ర్యాలీలో పాల్గొన్న టూవీలర్ మెకానిక్‌లు

బంగారుపాళెం: వాహనదారులు రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సీఐ నాగరాజరావు తెలిపారు. ఆయన ఆదివారం బంగారుపాళెంలో బంగారుపాళెం, చిత్తూరు పట్టణాలకు చెందిన టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత–ప్రమాదాల నివారణపై అవగాహన బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక మామిడి మార్కెట్ యార్డు నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు సాగింది. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద సీఐ మాట్లాడుతూ వాహనదారులు వేగంకన్నా.. ప్రాణంమిన్న అనే సత్యాన్ని గుర్తించుకోవాలన్నారు. చాలా వరకు ద్విచక్రవాహనదారులే ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు నిబంధనలు పాటించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు వివరించారు. కార్లలో ప్రయాణించే వారు తప్పని సరిగా సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. టూవీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు భాగస్వాములై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ముందుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్, బంగారుపాళెం మండల అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షులు జాకీర్, చిన్నా, సతీష్, చంద్ర, బాబు, షమీ వుల్లా, ఉమేష్, రసూల్, అస్లామ్, రబ్బానీ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం సీజ్


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న జి.ధనరాజ్ (52) అనే నిందితుడ్ని అరెస్టు చేసినట్లు సీఐ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ నగరంలోని ప్రభుత్వ ఐటీఐ వెనుకవైపు ఉన్న శ్మశానవాటిక వద్ద మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు దాడులు చేసినట్లు తెలిపారు. చిత్తూరుకు చెందిన ధనరాజ్‌ను అరెస్టు చేసి, 250 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ధనరాజ్‌ను అదుపులోకి తీసుకున్నామని, పారిపోయిన వి.కుమారస్వామి కోసం గాలిస్తున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ షేక్‌షావలి, సిబ్బంది పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియుల సంక్షేమానికి కృషి


బాపినాయుడుపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తవణంపల్లె: వన్నెకుల క్షత్రియుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఆయన ఆదివారం బాపినాయుడుపల్లె పాఠశాల ఆవరణలో పూతలపట్టు నియోజకవర్గ వన్నెకుల క్షత్రియుల యువగర్జన సభ నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గంలో 30 వేల మందికి పైగా వన్నెకుల క్షత్రియుల ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలో వన్నెకుల క్షత్రియులు అధికంగా ఉన్నప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. విద్యతోనే ఉన్నత స్థానాలు చేరుకుంటారని పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలోని రష్ హాస్పిటల్‌కు వచ్చిన వారికి సహాయం చేస్తామని చెప్పారు. వన్నెకుల క్షత్రియులు రాజకీయాలకతీతంగా ఐకమత్యంగా ఉండి సంఘం అభివృద్ధికి తోడ్పడాలన్నారు. వన్నెకుల క్షత్రియుల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలో ఇద్దరు వన్నెకులస్తులకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని వెల్లడించారు. ఇతర పార్టీల్లో తమ సేవలు ఉపయోగించుకున్నా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పూతలపట్టు నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు రెండు ఎకరాల స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు సీఆర్ రాజన్, యుగంధర్‌బాబు, హేమగిరి, సురేష్‌బాబు, దేవరాజులు, బాలాజీ, కుమార్, కుపేంద్రబాబు, శంకర్, శశికుమార్, ఉదయ్ పాల్గొన్నారు.

రెండు చుక్కలతో నిండు నూరేళ్లు



గుడిపాల: పోలియో చుక్కలను వేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, బంగారుపాళెం:తుంబకుప్పంలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ అమరావతి


తుమ్మిందలో పిల్లలకు చుక్కలు వేస్తున్న వైస్ ఎంపీపీ రంజని

చిత్తూరు రూరల్: రెండు చుక్కలతో పిల్లలు నిండు నూరేళ్ల ఆరోగ్యంగా జీవిస్తారని జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు తెలిపారు. ఆయన ఆదివారం అనంతాపురం పంచాయతీలో పల్స్ పోలియోను ప్రారంభించారు. పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లలకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలన్నారు. చిన్నారులకు అంగవైకల్యం రాకుండా పోలియో చుక్కలు విధిగా వేయించాలని కోరారు. తుమ్మిందలో వైస్ ఎంపీపీ రంజని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వంద శాతం లక్ష్యం పూర్తిచేయాలని అధికారులను కోరారు.

గుడిపాలలో..

గుడిపాల: పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ కోరారు. వారు ఆదివారం గుడిపాలలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్లు సంధ్య, చంద్రమహేష్, రష్మిత మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ భారతదేశాన్ని పోలియోరహిత దేశంగా గుర్తించిందన్నారు. పొరుగున ఉన్న పాకిస్తాన్, అఫ్ఘనిస్తాన్‌లో కొన్ని పోలియో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే పల్స్ పోలియో కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా చేపట్టినట్లు వివరించారు. గుడిపాల పీహెచ్‌సీలో 2,426 మంది పిల్లలు ఉండగా 2,406 మందికి, బొమ్మసముద్రం పీహెచ్‌సీలో 2,821 మందికి గాను 2,768 మందికి పోలియో చుక్కలు వేసినట్టు తెలిపారు. సీహెచ్‌వో నరసింహమూర్తి, సిబ్బంది విజయ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పూతలపట్టులో..

పూతలపట్టు: మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. పూతలపట్టు ఆరోగ్య కేంద్రం పరిధిలోని 24 బూత్‌లలో ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారు. వేనూతనపల్లిలో మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యధికారి ప్రియాంక, ప్రవీణ, మెడికల్ ఆఫీసర్స్ శ్రీనివాసమూర్తి, సర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కాణిపాకంలో..

కాణిపాకం: స్వామివారి దర్శనార్థం వచ్చే ప్రతి చంటి బిడ్డకూ పోలియో చుక్కలు వేయాలని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు తెలిపారు. ఆయన ఆదివారం కాణిపాకంలో ఆలయం వద్ద పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు హరిమాధవ రెడ్డి, ఎస్వీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐరాలలో..

ఐరాల: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని ఐరాల, చిగరపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారులు ప్రవీణ్ కుమార్, స్వాతిసింధూర తెలిపారు. వారు మాట్లాడుతూ రెండు పీహెచ్‌సీల పరిధిలో 5005 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. ఐరాల పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లా రోగ్య శాఖ స్టాటిస్టికల్ అధికారి జార్జ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుగుణవతి, ఎంపీహెచ్‌ఈవో శివయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదమరిలో..

యాదమరి: మండలంలో 99 శాతం మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఎంపీడీవో సింగయ్య తెలిపారు. మండలంలో 2,373 మంది పిల్లలు ఉండగా ఆదివారం సాయంత్రానికి 2,361 మందికి పోలియో చుక్కలు వేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని జిల్లా గణాంకాల అధికారి జార్జ్ పరిశీలించారు. వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ అమరావతి తెలిపారు. మండలంలోని తుంబకుప్పంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పోలియో నుంచి పిల్లలను రక్షించుకునేందుకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్ మాట్లాడుతూ పిల్లలకు పోలియో చుక్కలు వేయడానికి మండలంలో 49 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం సాయంత్రానికి 98.05 శాతం పూర్తి చేసినట్టు చెప్పారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. చీకూరుపల్లెలో పల్స్‌పోలియో కేంద్రాన్ని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వెంకటప్రసాద్, బంగారుపాళెం, తగ్గువారిపల్లె, నల్లంగాడు కేంద్రాలను ఎస్‌వో జార్జి పర్యవేక్షించారు. బంగారుపాళెం సర్పంచ్ ఉమాదేవి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ దీప్తిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, సర్పంచ్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్లు లోకేష్, రమేష్, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు పాల్గొన్నారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైందని వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలో ఆదివారం 40 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. మండలంలో 5,545 మంది ఉండగా 5,306 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు. పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని జిల్లా గణాంక అధికారి జార్జి ప్యవేక్షించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజామణి, సీహెచ్‌వో భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు రాజశేఖర్, శ్రీహరి, రెడ్డెమ్మ, నిర్మలమ్మ, హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.





గుడిపాల: పోలియో చుక్కలు వేస్తున్న సర్పంచ్ రజినీకాంత్, పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న సుధాకర్ రెడ్డి, ఐరాల: పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, తవణంపల్లె పీహెచ్‌సీలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ ప్రియాంక





యాదమరి: అతికారపల్లెలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీడీవో సింగయ్య, పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ ఎం.ఎస్‌బాబునాయుడు, కాణిపాకంలో పోలియో చుక్కలు వేస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఆలయ ఈవో వెంకటేశు